# ముందుమాట

నేటికి పధ్నాలుగు వందల సంవత్సరాలకు పూర్వం కరుణామయుడైన అల్లాహ్ సమస్త మానవాళికి తన సందేశం అందించడానికై తన దాసుల్లో సద్వర్తనులైన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ఎన్నుకున్నాడు. ఆనాడు ప్రపంచం అంధకారంలో మునిగి ఉంది. సత్యం, సదాచారం, సన్మార్గం అనేవి మానవ సమాజంలో బొత్తిగా అరుదైపోయాయి. ప్రజలు సన్మార్గాన్ని అన్వేషించేవారు. కాని వారికి అది లభించేది కాదు. తాత్వికతను, హేతువును ప్రబోధించే విద్యాలయాలెన్నో ఆనాడు ఉన్నప్పటికీ మానవత తన గమ్యాన్ని, గమనాన్ని గుర్తించలేక కారుచీకట్లలో తచ్చాడుతుండేది. ఇలాంటి నికృష్టపు పరిస్థితుల్లో దైవకారుణ్యం ఉప్పొంగింది. కృపాకరుడైన ఆ ప్రభువు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను తన ప్రవక్తగా - అంతిమ సందేశహరునిగా - ఎన్నుకుని సమస్త మానవులకు మహోపకారం చేశాడు.

"వాస్తవానికి అల్లాహ్ విశ్వాసులకు మహోపకారం చేశాడు : స్వయంగా వారినుండే వారి మధ్య ఒక ప్రవక్తను లేపాడు. అతడు ఆయన ఆయత్‌లను వారికి వినిపిస్తాడు. వారి జీవితాలను తీర్చిదిద్దుతాడు, వారికి గ్రంథాన్ని, వివేకాన్ని నేర్పుతాడు. వాస్తవానికి ఈ ప్రజలే ఇంతకు పూర్వం ప్రత్యక్షమయిన వక్రమార్గాల్లో పడివున్నారు."

(ఆలి ఇమ్రాన్ : 164)

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కు లభించిన దైవదౌత్యం, హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి ప్రార్థనాఫలం. ఇంకా అది సకల లోకాల వారి కోసం అల్లాహ్ తరఫున వొసంగబడిన కారుణ్యం. ఒక ప్రవక్తగా ఆయన (సఅసం) గారి బాధ్యతలను పవిత్ర ఖుర్‌ఆన్‌లో నాలుగుచోట్ల పేర్కొనటం జరిగింది.

**1. తిలావతె ఖుర్‌ఆన్ :** దివ్య ఖుర్‌ఆన్‌ను చదివి వినిపించటం.

**2. తజ్‌కియ :** అంటే తన సహచరుల నీతినడవడికలను, ప్రవర్తనను గమనించి, సంస్కరించటం, వారిలోని చెడుగులను దూరం చేయటం, ఉత్తమ నైతికతను అలవరచుకోమని వారికి ప్రబోధించడం. ఈ లక్ష్యసాధనకొరకు తాను స్వయంగా ఆదర్శవంతంగా నిలబడటం.

**3. గ్రంథ బోధన :** అంటే దివ్య ఖుర్‌ఆన్‌లోని ఆయత్‌ల భావాన్ని విడమరచి చెప్పటం,

https://teluguislam.net

దైవాదేశాలను స్పష్టీకరించటం, స్వీయ ఆచరణ ద్వారా ఖుర్ఆన్ వాక్యాల ధ్యేయాన్ని చాటిచెప్పటం, ఉదాహరణకు : నమాజ్, రోజా, జకాత్, హజ్, జిహాద్ మొదలగు విధ్యుక్త ధర్మాలను క్రియాత్మకంగా నిరూపించటం.

**4. వివేకాన్ని నేర్పడం :** ఎందరో ప్రాచీన విద్వాంసుల, ఖుర్ఆన్ వ్యాఖ్యాతల అభిప్రాయంలో 'వివేకం' అంటే భావం మహాప్రవక్త (స) గారి ఆచరణే. ఆయన (స)కు దివ్యఖుర్ఆన్‌తో ప్రగాఢ సంబంధం ఉండేది. ఖుర్ఆన్‌పై ఆయన ఎల్లప్పుడూ ఆలోచించేవారు, యోచించేవారు. దానికి ఎంతగానో ప్రభావితులయ్యేవారు. ఆయన జీవితం ఖుర్ఆన్ రంగులో రంగరించబడి ఉండేది. ఇదిలా ఉండగా ఆయనపై సతతం దేవుని పర్యవేక్షణ ఉండేది. ఆయనకు అనునిత్యం దైవతోడ్పాటు లభించేది. అనువర్తన (ఇజ్తెహాద్) కు సంబంధించిన పొరబాటు గనక ఆయన వల్ల ఎప్పుడన్నా జరిగితే, దైవం తరపున వెంటనే అది సరిదిద్దబడేది. చెప్పవచ్చిందేమంటే మరే మనిషిలోనూ లేని కొన్ని అసాధారణ ప్రత్యేకతలు మహాప్రవక్తలో ఉండేవి.

◆ దైవత్వం, దేవుని గుణగణాల గురించి ఆయనకు అందరికన్నా ఎక్కువ తెలుసు. ధర్మాధర్మాలు, మంచీచెడులు యుక్తాయుక్తాల విచక్షణా జ్ఞానం కూడా ఆయనకు అందరికంటే ఎక్కువ ఉండేది.

◆ ఆయన అందరికన్నా అధికంగా అల్లాహ్‌కు భయపడేవారు. దైవాన్ని సేవించే, విధేయత కనబరిచే విషయంలో అందరికన్నా ముందుండేవారు.

◆ ఆయన ఉత్తమ సందేశ ప్రచారకులు. మహా వక్త. ప్రతి విషయాన్ని ఆయన ఎంత చక్కగా, ఉత్తమ రీతిలో బోధించేవారంటే, ఆ విషయాన్ని అంతకన్నా మంచిగా వివరించటం సాధ్యపడదు.

◆ ఆయన (సఅసం) అందరికన్నా గొప్ప మానవశ్రేయోభిలాషి. మానవులను నరకాగ్ని నుండి రక్షించడానికి ఆయన సాధ్యమయినన్ని ప్రయత్నాలన్నీ చేసేవారు. ఈ మహత్కార్యం కొరకు ఎలాంటి త్యాగానికయినా సిద్ధంగా ఉండేవారు.

ఆయన పవిత్ర నోట వెలువడే ఒక్కొక్క పలుకులో బాధ్యతాభావం, భయభక్తులు, ధర్మనిష్ఠ తొణికిసలాడేవి. మరోవంక ఆయన జీవితంలో జీవిత సత్యాల సమగ్రరూపం ఉట్టిపడుతూ ఉండేది. (దేవుని తరపున శాంతి, దీవెనలు ఆయనపై కురియుగాక!) ఆయన పలుకులు

https://teluguislam.net

సంక్షిప్తంగానే ఉన్నప్పటికీ అందులో ఎంత సమగ్రత ఉండేదంటే, వాటిని వివరిస్తూపోతే అది మహాసాగరమే అవుతుంది. ఆయన ప్రవచనాల లోతుల్లోకిపోయిన వారికి గొప్ప వివేక సంపద లభిస్తుంది.

దివ్య ఖుర్‌ఆన్‌లాగానే హదీసుల విషయంలోనూ జాగ్రత్తగా ఖచ్చితంగా వ్యవహరించాలన్నది సల్ఫెసాలెహ్‌ల విధానం. వారి మార్గానుసరణలోనే జీవితపు అన్ని రంగాలతో ముడిపడి ఉన్న కొన్ని హదీసుల (ప్రవక్త ప్రవచనాలు) ను ఎన్నుకుని వాటిని విపులీకరించటం జరిగింది. అవసరమనుకున్న చోట్ల మరికొన్ని వివరాలు కూడా క్రోడీకరించవలసి వచ్చింది. ఉదాహరణకు, ఉల్లేఖకులయిన సహాబాల జీవిత చరిత్రలోని కొన్ని ఘట్టాలు, దివ్య ఖుర్‌ఆన్ ఆయత్‌లు, ఈ గ్రంథాన్ని అందించటంలో ప్రాచీన హదీసువేత్తల వ్యాఖ్యానాలు, అభిప్రాయాలపై వీలయినంతవరకు ఆధారపడటం జరిగింది. మరికొన్ని చోట్ల ఆయా వ్యాఖ్యాతల అభిప్రాయాలను యధాతథంగా పొందుపరచటాన్ని కూడా మీరు గమనిస్తారు.

అల్లాహ్ ఈ కృషిలోని లోటుపాట్లను మన్నించి కరుణించుగాక! ఇంకా పాఠకులకు దీనిద్వారా ధర్మజ్ఞానం ప్రసాదించుగాక! (ఆమీన్). ఈ పుస్తక ప్రచురణలో ఆర్థిక సహకారం అందించిన శ్రేయోభిలాషులందరికీ అల్లాహ్ ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించుగాక! వారి సంపదలో సమృద్ధినొసగుగాక! (ఆమీన్).

**- సఫీ అహ్మద్ మదనీ**

https://teluguislam.net